క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం సబ్ స్టేషన్ పరిధిలో నూతన లైన్ పనుల కోసం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు చెప్పారు. ప్రజలు అంతరాయానికి సహకరించాలని కోరారు.

నేడు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక సమారాధన

కురిచేడు: బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ జ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తీక సమారాధన జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. శ్రీకాళహస్తీశ్వర స్వామికి లక్షబిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ జ్ఞానప్రసూనాంబ దేవికి మహిళలు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ, సహపంక్తి భోజనం చేస్తారు. మండలంలోని బ్రాహ్మణులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని సంఘ నాయకులు కోరారు.

అయ్యప్పలకు నిత్యాన్నదానం



దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో అయ్యప్పలకు నిత్యాన్నదానం చేపట్టారు. ఏటా అయ్యప్ప, శివ, బ్రహ్మంగారు, కనకదుర్గమ్మ మాలలు ధరించిన వారికి నిత్యాన్నదానం జరుగుతోంది. స్వాములే దాతలుగా నిలిచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భైరవానంద స్వామి స్వాములను సహకరించి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎవరైనా మాల ధరించిన వారు అన్నదానం కార్యక్రమానికి దాతలుగా నిలిచి సహకరించాలని భైరవానంద స్వామి కోరారు.

తిరుమలనాథస్వామికి విశేష పూజలు



తిరుమలనాథస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొండ్రాలికొండ తిరుమల నాథస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో విశేష పూజలు శనివారం చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో అలంకరించారు. అమ్మవారి వద్ద దంపతులు శ్రీచక్రం వద్ద కుంకుమార్చన, పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైద్యశాలలో బాలింతలకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్లు, నాయకులు

యర్రగొండపాలెం: జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు కృష్ణారెడ్డి, అనిల్, జిల్లా మాజీ అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్, కటిక శంకర్, గర్నెపూడి కోటి, కంచి బాలసుబ్రహ్మణ్యం, ఉప్పలపాటి ఏసోబు, ఆవుల బిట్టు, కంచర్ల నాగేశ్వరగౌడ్ పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు



సచివాలయానికి వెళ్తున్న విద్యార్థులు

పెద్దదోర్నాల: వృత్తి విద్యా కోర్సుల్లో (ఐటీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐనముక్కలలోని సచివాలయాన్ని శనివారం సందర్శించారు. పారిశ్రామిక కేంద్రాల పరిశీలనలో భాగంగా సచివాలయాలను సందర్శించిన విద్యార్థులు ఉద్యోగులు, సిబ్బంది, విధి నిర్వహణ తదితర అంశాలు తెలుసుకున్నారు. హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఐటీ ఉపాధ్యాయులు సయ్యద్ నాయబ్ రసూల్, మారు తీరెడ్డి, గోపిరెడ్డి, ప్రేమచంద్, అగ్రికల్చర్ ఉపాధ్యాయురాలు సాహిత్య పాల్గొన్నారు.

బస్సుల కోసం నడిరోడ్లపై నిరీక్షణ



శ్రీశైలం రోడ్డులో వేచి ఉన్న ప్రయాణికులు



గుంటూరు రోడ్డులో బస్సు కోసం వేచి ఉన్న స్కూల్ విద్యార్థులు

- షెల్టర్లు లేక అవస్థలు పడుతున్న ప్రజలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో బస్సు షెల్టర్‌లు లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్వాదశ జోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలతో విలసిల్లుతున్న శ్రీశైల పుణ్యక్షేత్రానికి ముఖద్వారంగా ఉన్న మండల కేంద్రంలో బస్ షెల్టర్ల కొరత తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచే కాక కర్నాటక, తెలంగాణ, తమిళనాడు వంటి పలు రాష్ట్రాల నుంచి శ్రీశైల పుణ్యక్షేత్రానికి భక్తులు భారీగా ఇక్కడకు చేరుకుంటుంటారు. దీంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి చేరుకుని వారి పనులు ముగించుకున్నారు. తిరిగి తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. ఈ క్రమంలో శ్రీశైలం రోడ్డు, కర్నూల్ రోడ్డు, గుంటూరు రోడ్లలోని పలు ప్రాంతాల్లో బస్సుల కోసం ఎదురు చూస్తుంటుంటారు. నటరాజ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండ్‌లో మినహా మండల కేంద్రంలో మరెక్కడా బస్ షెల్టర్లు లేక పోవటం విశేషం. గుంటూరు రోడ్డులో చెక్‌పోస్టు సెంటర్, సీతారామ నగర్, ఇండియన్ పెట్రోల్ బంకు, కర్నూల్ రోడ్డులో ఐనముక్కల, కడపరాజుపల్లె రోడ్డు, శ్రీశైలం రోడ్డులోని శివసదనం, అయ్యప్పస్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో యాత్రికులు వాహనాల కోసం ఎండ, వానల్లోనే వేచి ఉండే పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దాతల తోడ్పాటుతో లేదా ప్రభుత్వ నిధులతో బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోంది:



ఎక్కడికైనా వెళ్లాలంటే బస్సుల కోసం ఎండలోనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. మండల కేంద్రంలో దశాబ్దాల నుంచి ఒక్క బస్ షెల్టర్ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో పురుషులు, మహిళలు తేడా లేకుండా ఎండ, వానాలోనే వాహనాల కోసం అల్లాడాల్సి వస్తోంది. బస్ షెల్టర్ ఏర్పాటుకు దాతల తోడ్పాటు కూడా ఎంతో అవసరం

– షేక్ రబ్బానీ, ప్రయాణికుడు, పెద్దదోర్నాల

బంగారు బాల్యానికి ఉపాధ్యాయులు బాటలు వేయాలి



దర్శిలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రవికుమార్



ముండ్లమూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ జనార్దన్



పుల్లలచెరువు: వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థినులు



తాళ్లూరులో..

దర్శి: విద్యార్థుల బంగారు బాల్యానికి ఉపాధ్యాయులు బాటలు వేయాలని మండల ప్రత్యేకాధికారి రవికుమార్, ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక పట్టణంలోని బాలికల పాఠశాలలో శనివారం బంగారు బాల్యం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, ప్రధానోపాధ్యాయుడు కాలేషా పాల్గొన్నారు.

ముండ్లమూరులో..

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఏరియా కో ఆర్డినేటర్ తప్పెట డేవిడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకుని తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సునీత, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు వ్యాసరచన రాయడం ఎంతో ఉపయోగకరమని కేజీబీవీ ప్రిన్స్‌పాల్ లిల్లీప్రకాశ్‌వాణి అన్నారు. బంగారు బాల్యం–బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా మూడో రోజు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో పోటీ పరీక్షలకు తప్పనిసరిగా వ్యాసరచన ఎంతో ఉపయోగపడుతుందని, సామాజిక విషయాలపై, ఇతర విషయాలు తెలుసుకుని వ్యాసరచనలో ఎలా రాయాలో విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థి వ్యాసరచన, క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను జిల్లాస్థాయిలో రాసేందుకు చర్యలు తీసుకుంటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లూరు: బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని జనశిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.శ్యామ్ సునీల్ అన్నారు. మండలంలోని లక్కవరంలో బాల్య వివాహాలపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్యామ్ సునీల్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ద్వారానే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. తద్వారా దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తారన్నారు. బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. డీడీఆర్సీ డి.కోటేశ్వరరావు, కార్యదర్శి సాధన పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



పెద్దదోర్నాల: ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న కార్యదర్శి, ఉపాధ్యాయులు



పెద్దారవీడు: గ్రంథాలయంలో చెస్ ఆడుతున్న బాలికలు



కబడ్డీ ఆడుతున్న గ్రంథపాలకురాలు ఝాన్సీ



దర్శిలో..

దర్శి: గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఏజీటీ అందే బాలకోటిరెడ్డి, విశ్రాంత ఎంపీడీఓ పోకూరి అచ్చయ్య అన్నారు. జాతీయ గ్రంథాలయం వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో 57వ వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు వెంకట రమణ అయ్యగారు, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, ఎస్సార్ రంగనాథన్‌ల చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలకోటిరెడ్డి, అచ్చయ్యలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి వెళ్లి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయ పాలకురాలు వి.విజయకుమారి, చెంచులింగం, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బాలికలకు శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథ్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బాలికలకు వ్యాసరచన, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. మాజీ ఉప సర్పంచ్ సంకుల పెద్దకోటయ్య, జక్కా వెంకటేశ్వర్లు, ముడమంచు పెద్దకాశయ్య పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో పాల్గొనాలని, అప్పుడే ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని గ్రంథపాలకురాలు కటిక ఝాన్సీ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ మేథ సంపతిని పెంపొందిచుకోవాలంటే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈ నెల 20న జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. హెచ్‌ఎంలు ఈర్ల రమాదేవి, బి.పుల్లయప్ప, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు ఘన నివాళి

పెద్దదోర్నాల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయంలో గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులైన ఎస్సార్ రంగనాథన్, పాతూరు నాగభూషణ్, అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావుల చిత్రపటాలకు పంచాయతీ కార్యదర్శి శివకోటేశ్వరరావు, రామానాయక్, గోపిరెడ్డిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమకారుల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

బాల్య వివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాలి

త్రిపురాంతకం: బాల్య వివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు పలు రకాలుగా ప్రజలను చైతన్య పరిచి బాల్య వివాహాల నిరోధానికి పనిచేస్తున్నాయన్నారు. బాలలందరినీ బడులకు పంపి చదివించాలని కోరారు. అదే విధంగా గ్రామాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రతి ప్రజాప్రతినిధి సహకారం అందించి కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలు తమ దృష్టికి తెస్తే ఉన్నతాధికారుల ద్వారా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పథకాలు లబ్ధిదారులకు అందించేందుకు సహకారం అందించాలని కోరారు. ఎంపీపీ రిబకమ్మ మాట్లాడుతూ మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాసులు ప్రజా పంపిణీ వ్యవస్థ, రెవెన్యూ సమస్యలపై వివరించారు. ఎంఈఓ కె.తులసిమల్లికార్జున నాయక్ మాట్లాడుతూ విద్యాశాఖ ద్వారా ప్రభుత్వం ఈ వార్షిక యోజనలో చేపట్టిన విషయాలు వివరించారు. ఏఓ కె.నీరజ మాట్లాడుతూ ఖరీఫ్, రబీలో వేసిన పైర్లు ఈ–క్రాప్ ద్వారా నమోదు చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ ఆళ్ల ఆంజనేయరడ్డి ప్రజా సమస్యలపై ప్రశ్నించారు. రైతులకు రావాల్సిన సబ్సిడీలు అందలేదని, ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఉద్యాన అధికారి ఆదిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఎస్సీలకు రావాల్సిన బకాయిలు అందాయని, మిగిలినవి త్వరలో వస్తాయన్నారు. డ్రిప్‌పై సబ్సిడీ ఇస్తున్నట్లు వివరించారు. గృహాలు నిర్మించుకున్న వారికి బకాయిలు అందిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. పంట కాలువలు ఉపాధి హామీ నిధులతో మరమ్మతులు చేయాలని సభ్యులు ప్రశ్నించారు. ఉపాధి హామీ ద్వారా చేస్తున్న పనులు ఏపీఎం సుజాత వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు సుబ్బారావు ప్రశ్నించగా స్థానికంగా సహకరిస్తేనే అవకాశం ఉంటుందని సూపర్‌వైజర్ హైమావతి తెలిపారు. విద్యుత్ శాఖ, ఎస్ఎస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులు శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకట సుబ్బయ్య, శ్రీమన్నారాయణ, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన బూచేపల్లి



వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే బూచేపల్లి

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో గూడా సుబ్బారెడ్డి కుమారుడు ఆంజనేయ రెడ్డి వివాహ వేడుకలకు దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. పెళ్లి కుమారుడికి అక్షతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పోశం నారాయణరెడ్డి, నాయకులు గవ్వల శ్రీనివాస రెడ్డి, కూలూరి అంజిరెడ్డి, గువ్వల నారాయణరెడ్డి, గూడా జయరామిరెడ్డి పాల్గొన్నారు.

అన్యమత ప్రచారంపై ఫిర్యాదు

కురిచేడు: మండలంలోని దేకనకొండ సమీపంలోని సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అన్యమత ప్రచారం చేస్తున్నారని శుక్రవారం పోలీసులకు ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ గ్రామానికి చెందిన సుమారు 50 మంది మరో సామాజికవర్గానికి చెందిన వారు ఫిర్యాదు చేసిన వ్యక్తిపై దాడికి యత్నించి బెదిరించారు. విషయం తెలుసుకున్న త్రిపురాంతకం ఏఎస్ఐ భాస్కర్‌రెడ్డి తన సిబ్బందితో ఆలయం వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

రాష్ట్ర ప్రభుత్వమే 108 సేవలు నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

దర్శి: రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా 108 సేవలు నిర్వహించాలని 108 సిబ్బంది ఈఎస్‌టీ వెంకట్రావు, వరకుమార్, కోటయ్యలు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ జనార్దన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం స్లాబ్‌ల ప్రకారం అందరి వేతనాలు చెల్లించాలన్నారు. సర్వీసు ఆధారంగా ఎప్పటికి అప్పుడు స్లాబ్‌లను అప్ గ్రేడ్ చేయాలన్నారు. 8 గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య, ఆరోగ్య శాఖలోని ఈఎంటీ పోస్టుల్లో 108 ఈఎంటీలను నియమించాలని, పైలెట్‌లు ఈఎంటీలకు ఇతర ఖాళీల్లో వారి వారి అర్హత ఆధారంగా వెయిటేజ్ ఇచ్చి నియమించాలని, పైలెట్‌లను ఆర్టీసీలో డ్రైవర్‌లుగా వెయిటేజ్ ఇచ్చి నియమించాలని కోరారు. సహజమరణం, ప్రమాదాల్లో చనిపోయిన ఉద్యోగులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గత టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన జీఓ ఎంఎస్ నెంబర్ 49 ప్రకారం అమలు చేసిన నెలకు రూ.4 వేలు తిరిగి పునరుద్ధరించాలని, చెల్లింపులకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులను వారి వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, 108 సేవల్లో ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25వ తేదీ తర్వాత రాష్ట కమిటీ నిర్ణయం మేరకు సమ్మె చేస్తామని హెచ్చరించారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు

దర్శి: ప్రభుత్వమే రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించాలని నవ్యాంధ్ర మాదిగ చర్మ డప్పు కళాకారుల సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కవలకుంట గోవింద్ ప్రసాద్ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు దళిత సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవింద్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ అన్నీ తెలుగు రాష్ట్రాల్లో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించాలని కోరారు. హోశాఖతో సహా అన్నీ కార్యాలయాల్లో మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి సభలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దళిత సేన నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాచపూడి మోషే, కంబంపాటి జోసఫ్, ఎర్రగుంట్ల మోషే పాల్గొన్నారు.

కొమ్మ తెగులుతో అప్రమత్తంగా ఉండాలి



కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

దొనకొండ: గ్రామాల్లోని రైతులు సాగు చేసిన మిరపలో కొమ్మ తెగులుతో అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ తెలిపారు. శనివారం మండలంలోని పోలేపల్లి గ్రామంలో క్షేత్ర సందర్శనలో భాగంగా మిరప, కంది పంటలను ఆయన పరిశీలించారు. వారం రోజులుగా వాతావరణం దృష్ట్యా మిరపలో కొమ్మ తెగులు ఆశించిందని, లేత కొమ్మలు ఎండి పోతున్నాయని, కొమ్మల మీద బూజు ఏర్పడి చివరి వరకు ఎండి కొమ్మ విరిగి పోతుందని వివరించారు. మంచు, రాత్రి ఉష్ణోగ్రత తగ్గటంతో దీని ఉధృతి ఎక్కువ అవుతుందన్నారు. సరైన చర్యలు తీసుకోకుంటే నష్టం ఊహించనంతగా ఉంటుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రా, 2 గ్రా ప్లాంటో మైసిన్ 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎక్కువ ఉంటే హెక్సాకానోజల్, కెప్టెన్ మందును 400 గ్రా ఎకరాకు చల్లాలని చెప్పారు. కంది పంటలో ఇప్పుడిప్పుడే మొగ్గ వస్తుందని, చుట్టే పురుగు లేదా మచ్చల పురుగు రాకుండా ఎకరాకు లీటర్ వేప నూనె లేదా వేప గింజల కషాయాన్ని చల్లి నివారించుకోవాలని సూచించారు. వారి వెంట టెక్నికల్ అధికారి వెంకటేశ్వర రెడ్డి, మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, సహాయకులు వీరాంజనేయులు, విన్నీబాబు, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరు సాగించాలి



మాట్లాడుతున్న కుల్లాయి స్వామి

దర్శి: విద్య వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, కాషాయికరణకు వ్యతిరేకంగా పోరు సాగించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కుల్లాయి స్వామి అన్నారు. స్థానిక గుజ్జుల సరళాదేవి భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుల్లాయి స్వామి మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. కార్పొరేట్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరు సాగించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని కోరారు. ఈ నెల 19న పొదిలిలో జరిగే ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభల్లో విద్యారంగ సమస్యలపైనే చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మహాసభలను విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు రామంజి, నియోజకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు సురేంద్ర,స్టాలిన్ పాల్గొన్నారు.

కార్యదర్శికి మెమో

సాక్షి ఎఫెక్ట్..

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పసుపుగల్లు పంచాయతీ పరిధిలో చేపల చెరువుకు 'ఉన్నతాధికారులు లేకుండానే చేపల చెరువుకు వేలం' అనే శీర్షికతో శనివారం ప్రచురించిన కథనానికి ఎంపీడీఓ జనార్దన్ స్పందించారు. గ్రామ కార్యదర్శి పాణెం మౌలాలీకి అధికారులు లేకుండా ఎలా చేపల చెరువుకు వేలం నిర్వహించావని మెమో జారీ చేశారు. గత ప్రభుత్వంలో రూ.46.50 లక్షలకు పాట పాడితే ప్రస్తుతం రూ.22.30 లక్షలకు మాత్రమే పాట పోయిందంటే పంచాయతీకి రూ.24.20 లక్షలు గత ప్రభుత్వంలో కంటే నష్టం ఎందుకు వాటిల్లిందని కార్యదర్శిని ప్రశ్నించారు. ఇదే విషయం డీఎల్‌పీఓకు, డీపీఓకు కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. తమకు తెలియకుండానే చేపల చెరువు వేలం పాట వేశారని ఎంపీడీఓ చెప్పారు. పంచాయతీ కార్యదర్శి వేలం పాట వేయాలంటే ఆ పంచాయతీ పరిధిలో రూ.25 వేలు మాత్రమే పాట పెట్టే అధికారం ఉంటుందని, ఇలా చేపల చెరువులు రూ.లక్షల్లో ఆదాయం వచ్చే పాటలకు పైఅధికారుల సమక్షంలో పెట్టాలని స్పష్టం చేశారు.

వేలంలో అవినీతి?

చేపలచెరువు వేలం పాటకు గతంలో కంటే తక్కువ పాట రావడంపై గ్రామస్తులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలం ద్వారా పంచాయతీ అభివృద్ధికి నాయకులు కృషి చేయాల్సింది.. ఎవరి సౌలభ్యం వారు చూసుకుంటూ పంచాయతీకి వచ్చే నిధులను వారి జేబులు నింపుకోవాలని చూడటంపై మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా వేలం పాటకు ఎవరూ రాకుండా చేసి సిండికేట్‌గా మారి తక్కువ పాట పోయేలా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. గ్రామస్తులు మళ్లీ వేలంపాట పెట్టి గతంలో కంటే ఎక్కువ వేలం పాట పోయేలా అధికారులు అందరికీ తెలియపరిచి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.